వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 292 | సోమవారం | 03 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



## సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవ మూర్తికి ఘన సన్మానం

సన్మానించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

8 లో..

**రేపు లోక్ సభ ఓట్ల లెక్కింపు**

# త్రిముఖపోరులో.. గెలిచేదెవరో!







**తేలనున్న అభ్యర్థుల భవితవ్యం**

**ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో వరంగల్,**

**సోషల్ వెల్ఫేర్ హైస్కూల్‌లో మహబూబాబాద్ కౌంటింగ్**

**ఏర్పాట్లు చేసిన అధికారులు**

లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ఎవరికి ఎవరికి పట్టం కట్టనున్నారన్న విషయం తేలేందుకు మరి కొద్ది గంటల సమయం మాత్రమే ఉంది. వరంగల్, మహబూబాబాద్‌లో నువ్వా.. నేనా అన్నట్లుగా సాగిన పోరులో విజేతలెవరో త్వరలో తేలనుంది. అయితే ఈ రెండు నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొందని చెప్పవచ్చు. బీఆర్ఎస్‌కు చెందిన రెండు సిట్టింగ్ సీట్లను తిరిగి కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ నేతలు తీవ్రంగానే కృషి చేశారు.

కాగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండం అంటూ ప్రకటించడంతోపాటు విజయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలుపెరుగని పోరాటాన్నే చేశారు. ఇక దేశమంతా మోడీ వైపే చూస్తుందని, రాష్ట్రంలో డబుల్ డిజిట్ గ్యారెంటీ అంటూ బీజేపీ శ్రేణులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎగ్జిట్ పోల్ సర్వేలు సైతం వరంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య, మహబూబాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య ప్రధాన పోటీ నెలకొన్నట్లు తేలుస్తున్నాయి. ఏది ఏమైనా మంగళవారం మధ్యాహ్నంలోగా ఎవరు విజేతలు.. ఎవరు పరాజితులో తేలనుంది. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..




## అమరుల కుటుంబాలను ఆదుకుంటాం..

రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలు వెలకట్టలేనివి

రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్

తెలంగాణ ఉద్యమ కారులకు ఘన సన్మానం

8లో..



2 లో..

## కొంగల అడవుల్లో పేలిన మందు పాతర

కట్టెలకు వెళ్లిన అమాయకుడి బలి

భయాందోళనలో ఏజెన్సీ ప్రజలు

# త్రిముఖపోరులో గెలిచేదెవరో!



**రేపు లోక్ సభ ఓట్ల లెక్కింపు**

**తేలనున్న అభ్యర్థుల భవితవ్యం**

**ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో వరంగల్,**

**సోషల్ వెల్ఫేర్ హైస్కూల్ లో మహబూబాబాద్ కౌంటింగ్**

**ఏర్పాట్లు చేసిన అధికారులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత అంతటి ప్రాముఖ్యమున్న రెండో పార్లమెంట్ నియోజకవర్గం వరంగల్ కావడంతో అందరి చూపు ఈ నియోజకవర్గంపైనే ఉంది. హెూరా హారీగా సాగిన పోరులో విజేతలెవరన్న టెన్షన్ కొనసాగుతోంది. అయితే ఎవరికి వారు తామే విజేతలమంటూ చెప్పుకొస్తున్నారు. వరంగల్ లోక్ సభ నియోజక వర్గంనుంచి మొత్తం 42మంది పోటీ చేయగా ప్రముఖంగా పోటీ ప్రధాన పార్టీల మధ్యే నెలకొందని చెప్పవచ్చు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా అరూరి రమేశ్, బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ ఎం.సుధీర్ కుమార్ బరిలో నిలిచారు. అదే విధంగా మహబూబాబాద్ నియోజకవర్గంనుంచి బీఆర్ ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపి మాలోత్ కవిత, బీజేపీ అభ్యర్థిగా అజ్మీరా సీతారాం నాయక్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బలరాం నాయక్ పోటీ పడుతున్నారు. వరంగల్ లోక్ సభ ఓట్లను ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో, మహబూబాబాద్ లోక్ సభ ఓట్ల లెక్కింపును మానుకోట పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హైస్కూల్ లో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఓట్ల లెక్కింపు..

వరంగల్ లోక్ సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్ల సంఖ్య 18, 24,466 కాగా 12,56,301 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ 68.86 శాతం అయినట్లు అధికారులు ప్రకటించారు. ఏడు సెగ్మెంట్లకు గాను మొత్తం 124 టేబుల్స్ పై 127 రౌండ్లు లెక్కించనున్నారు. తొలిత పోస్టల్ బ్యాలెట్, హెూం ఓటింగ్, సర్వీస్ ఓట్లను గోదాం సంఖ్య 18సీ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 14 టేబుల్ పై లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

## వరంగల్‌లో..

మంగళవారం ఉదయం 8గంటలనుంచి లోక్ సభ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏనుమాముల మార్కెట్ యార్డులో జరగనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలను డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణి, డీఆర్ ఓ శ్రీనివాస్ లతో కలసి రిటర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్, పి.ప్రావీణ్య కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓట్లు లెక్కింపు సిబ్బంది, పోలీస్ మొత్తం 2,500 మంది సిబ్బంది పోలింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నట్లు తెలిపారు. 4వ తేది ఉదయం 6 గంటలకు ఎన్నికల కౌంటింగ్ పరిశీలకుల సమక్షంలో తుది ర్యాన్డమైజేషన్ నిర్వహించి ఆయా కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయిస్తామని ఆమె వివరించారు. రాజకీయ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని, గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను గాని సిబ్బందిని కాని ఎట్టి పరిస్థితిల్లో కౌంటింగ్ సెంటర్ లోనికి అనుమతించమని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ రౌండ్ వారిగా ఎన్ కోర్ లో ఫలితాలు అప్ లోడ్ చేసే విధంగా ఎన్ కోర్ సిబ్బంది, ఐటీ సిబ్బందికి శిక్షణ ఇచ్చి సన్నద్ధం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## మహబూబాబాద్‌లో..

మహబూబాబాద్ లోక్ సభ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హైస్కూల్ లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. సోమవారం కౌంటింగ్ కేంద్రాన్ని ఇతర అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఉదయం 8 గంటల నుంచే ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపునకు ప్రతి నియోజవకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కౌంటింగ్ లో సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, సపోర్టింగ్ సిబ్బంది మొత్తం 440మంది కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, ఆర్డీవో అలివేలు, మహబూబాబాద్ తహసిల్దార్ భగవాన్ రెడ్డి, సీపీఓ సుబ్బారావు, జిల్లా పరిషత్ సీఈఓ నర్మద, ఏడీ గ్రౌండ్ వాటర్ సురేష్, సంబంధిత అధికారులు, రెవెన్యూ యంత్రాంగం పాల్గొన్నారు.















# కొంగల అడవుల్లో పేలిన మందు పాతర

**వరంగల్ వాయిస్, ములుగు :** గత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పోలీసుల కోసం మావోయిస్టులు అడవిలో అమర్చిన మందు పాతరలు సామాన్యుల చావుకు కారణమవుతున్నాయి. కట్టెల కోసం అడవికి వెళ్ళిన అమాయకుడు మందు పాతర పెలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..వెంకటాపూర్ మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన ఇల్లందుల ఏసు వంట చెరకు కోసం కొంగల అటవీ ప్రాంతానికి ఐదుగురు మిత్రుల బృందంతో కలిసి వెళ్లారు. ఎండిన చెట్లను నరుకుతున్న సమయంలో ఆకస్మాత్తుగా మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి ఏసు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ సంఘటననుంచి మిగిలిన నలుగురు బయటపడ్డారు. వారు ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారు. సంఘటన స్థలంలో మందు పాతర కోసం అమర్చిన వైర్లు ఉండడంతో ఆ ప్రాంతానికి వెళ్లడానికి గ్రామస్తులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సంఘటనపై వాజేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మృతదేహాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ..

మందుపాతర పేలడంతో మృతి చెందిన ఏసు మృతదేహాన్ని ఎటునాగారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ అక్కడికి చేరుకున్నారు.



జరిగిన నష్టంపై వారి కుటుంబానికి సంతాపం తెలియజేశారు. మావోయిస్టులతోపాటు వారికి సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వెంకటాపురం సర్కిల్ ఇన్ స్పెక్టర్ కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, కృష్ణ ప్రసాద్, తిరుపతిరావు పాల్గొన్నారు.

# ఆదివాసీలపై అశ్రద్ధ

## తుడుందెబ్బ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీల మనుగడ కష్టంగా మారిందని ఆదివాసి హక్కుల పోరాటసమితి, తుడుందెబ్బ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణ ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రంలో ఆదివాసీలను, వారి నివాస ప్రాంతాలను, వారి రాజ్యాంగ హక్కులను పరిగణంలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 10 జిల్లాలను అశాస్త్రీయంగా 33 జిల్లాలుగా విభజించి ఆదివాసీల నివాస ప్రాంతాలను ముక్కులు చెక్కలు చేశారన్నారు. జీవో నెం.57, ఐటీడీఏల 5వ షెడ్యూల్డ్ ప్రాంతాల పాలన, అభివృద్ధి, ఆదివాసుల వికాసం, పురోభివృద్ధి, కాలనుగుణంగా మారుతున్న ధృక్పధాలకు అనుగుణంగా ఆదివాసీల పరిస్థితిని అంచనావేసి ప్రణాళికలు తయారు చేసే ఐటీడీఏల పాత్ర నామమాత్రంగా మారిపోయిందని విమర్శించారు.

## పోలీస్ శిక్షణ కేంద్రంలో కంటి వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, మడికొండ :** ప్రముఖ కంటి వైద్య ఆసుపత్రి శరత్ మాక్స్ విజన్ హనుమకొండ వారి ఆధ్వర్యంలో సిటీపోలీస్ శిక్షణ కళాశాల వరంగల్ (మడికొండ)లో ఇండోర్,అవుట్డోర్ శిక్షకులుగా పనిచేస్తున్నటువంటి సిబ్బందికి సోమవారంకంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ రాగ్యా నాయక్, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ రమణబాబు, ఇండోర్, ఔట్డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదారపు వాణిశ్రీకి తెలంగాణ సారస్వత పరిషత్ సత్కారం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** హనుమకొండకు చెందిన ప్రముఖ రచయిత్రి మాదారపు వాణిశ్రీ కి తెలంగాణ సారస్వత పరిషత్ సత్కారం అభించింది. రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు కేవి రమణాచారి, శాంత బయోటెక్ సంస్థ అధినేత డాక్టర్ కేఐ.వరప్రసాద్ రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య చేతుల మీదుగా వాణిశ్రీ ఈ సత్కారం అందుకున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాలకు చెందిన బాల సాహితీ వేత్తలతో నిర్వహించిన బాలసాహిత్య సమ్మేళనంలో పరిషత్ ఆవిష్కరించిన 'ఆరోగ్యం - విజ్ఞానం'పుస్తక వ్యాస కర్తలలో ఒకరిగా వాణిశ్రీకి ప్రత్యేక గౌరవం అభించింది. వారు రచించిన వ్యాసంలో పౌష్టికాహారానికి సంబందించిన.. ధాన్యాలు, సిరిధాన్యాలు, ఎండు ఫలాలు మొదలగు అంశాల గురించిన అనేక విషయాలు వివరించారని, ప్రస్తుత జీవన విధానాన్ని గమనిస్తే వీటి అవసరం చాలా ఉందని, వీటిపై అవగాహన రాబోయే తరానికి కూడా ఎంతో అవసరమని వాణిశ్రీ తెలిపారు.

## విద్యుత్ ఏఈ మౌనికకు అవార్డు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక హసన్ పర్తి మండల విద్యుత్ ఏఈ రామ్ చెట్టి మౌనికకు ఉత్తమ అధికారిణిగా సీఎండీ కే.వరుణ్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు పొందినట్లు ఏఈ మౌనిక తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా విద్యుత్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు సీఎండీ కే వరుణ్ రెడ్డి మౌనికను అభినందించారు. విధి నిర్వహణలో అంకితభావం ప్రదర్శిస్తూ విద్యుత్తు సరఫరా, విద్యుత్ సేవలు, వినియోగదారులకు నిరంతర సేవలు అందిస్తూ అందుబాటులో ఉంటూ స్వల్ప కాలంలోనే మంచి పేరు సంపాదించి ఉత్తమ అధికారిగా అరుదైన అవార్డు పొందారు. విద్యుత్ వినియోగదారుల సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు స్వీకరించినట్లు ఆమె ఈ సందర్భంగా తెలిపారు. మండల ప్రజలందరి సహకారంతో, పై అధికారుల ప్రోత్సాహంతో మరింత సేవ చేయడానికి బాధ్యత పెరిగినట్లుగా మౌనిక పేర్కొన్నారు. అవార్డుకు ఎంపిక చేసిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పితృస్వామ్య పీడన అణచివేతల విముక్తికై పోరాడుదాం

### భారత జాతీయ మహిళా సమాఖ్య నేత నేదునూరి జ్యోతి



**వరంగల్ వాయిస్, మేడ్చల్ :** మహిళలపై వివక్ష, అణచివేత, సామాజిక కట్టుబాట్లు, పితృ స్వామ్య ఆధిపత్యం, శ్రమ దోపిడీ, అత్యాచారాలు, హత్యలు, నిత్య కృత్యమై పోవడంపై భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం భారత జాతీయ మహిళా సమాఖ్య 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండలంలోని సాయి నగర్ కాలనీలో 70వ వార్షికోత్సవ సదస్సు షహదా బేగం అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతి మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హంతకదాడులు దినదినం పెరిగిపోతున్నాయని, పాలకవర్గాలు ఈ అరాచకాలు అరికట్టడంలో వైఫల్యం చెందారని మండిపడ్డారు. దేశంలో 70 సంవత్సరాల క్రితం 1954లో భారత జాతీయ మహిళా సమాఖ్య గీతా ముఖర్జీ, అరుణ ఆసఫ్ అలీ, రేణు చక్రవర్తి లాంటి ఎందరో కమ్యూనిస్టు మహిళా ఉద్యమకారుల త్యాగాలతో ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఏర్పడిందన్నారు. సామాజిక అసమానతలపై, బాల్య వివాహాలపై, సతీసహగమనం, శ్రమ దోపిడీకి, పితృస్వామ్య పీడన అణచివేతల నుంచి విముక్తి కోసం పోరాడుదామని నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. స్వాతంత్ర అనంతరం మహిళలకు అన్ని రంగాలలో జనాభా ఆధారంగా 50 శాతం అవకాశాలు కల్పించాలని, విద్యా, ఉద్యోగ, వైద్య రంగాలలో రిజర్వేషన్లు కల్పించి దేశాభివృద్ధిలో మహిళలను భాగస్వాములను చేయాలన్నారు. రాజ్యాంగబద్ధంగా నడవవలసిన సంస్థలు, కోర్టులు, సీబీఐ, ఎలక్షన్ కమిషన్ పాలకవర్గాలకు ఊడిగం చేసే సంస్థలుగా మారిపోయాయని విచారం వ్యక్తం చేశారు. రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో, రాజకీయ పార్టీలలో, ప్రభుత్వ పాలనలో స్త్రీల భాగస్వామ్యం పెరగాల్సిన ఆవశ్యకత ఉన్నదని, అప్పుడే సామాజిక విప్లవాలు విజయవంతం అవుతాయన్నారు. అందుకు మహిళా సమాఖ్య గ్రామ స్థాయి నుంచి నిర్మాణం పెంచుకొని ఆందోళనలు ఉధృతం చేద్దామని పిలుపునిచ్చారు. మహిళా ఉద్యమ నేతల్ని ఆదర్శంగా తీసుకొని మరిన్ని త్యాగాలతో మహిళా ఉద్యమాన్ని నిర్మిద్దామన్నారు మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి జే. లక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ షైమీద అన్నారు. మహిళలకు ఉచిత విద్య ఉపాధి అవకాశాలు కల్పించాలని, బాలికలకు కళాశాల స్థాయిలలో ఆత్మరక్షణ పద్ధతులను నేర్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ లు కట్టించాలని, రేషన్ షాపుల ద్వారా 16 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ఏ.ప్రమీల, ఉప్పల్ మండల అధ్యక్షురాలు కే జ్యోతి, నరసమ్మ, హేమలత, షీలా, ఎన్.అచ్చాలి, నాగటి పద్మ, లింగమ్మ, జ్యోతి, లక్ష్మమ్మ, సత్తమ్మ పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎంపీ మాలోత్ కవిత విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల వేడుకలను పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకం, బీఆర్ఎస్ పార్టీ జెండాలను కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలే వెన్నుముకగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, జడ్పీ చైర్ పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సీఐ రంజిత్ రావుకు కఠిన సేవా పతకం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి లోని శాయంపేట రూరల్ సీఐగా పనిచేస్తున్న రంజిత్ రావుకు సీపీ అంబర్ కిషోర్ ఝా తన కార్యాలయంలో కఠిన సేవా పథకాన్ని అందించారు. విధి నిర్వాహణలో రాణించే పోలీసు సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం కఠిన సేవా పతకాన్ని ప్రకటిస్తోంది. ఈ క్రమంలో శాయంపేట సీఐకు 2024 సంవత్సరానికి గాను, కఠిన సేవాపతకాన్ని ప్రకటించింది. మంచిర్యాల పట్టణ ప్రాంతానికి చెందిన రంజిత్ రావు 2012 సంవత్సరంలో ఎస్ఐగా పోలీసు శాఖలో చేరాడు. 12 సంవత్సరాల పాటు వివిధ జిల్లాల్లో సమర్ధవంతంగా పని చేసి ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహిస్తు ప్రజల మన్ననలు పొందుతున్నాడు.

# పోరాడే గొంతుక.. చుంచు రాజేందర్

### ఊరు- వాడకు ఉద్యమ వంతెన కట్టిన నాయకుడు

### ఏబీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** దళిత, పీడిత, అణగారిన మహిళా వర్గాల పక్షాన గత రెండు దశాబ్దాలుగా పోరాడుతూ సమాజంలో పోరాడే గొంతుకగా దళిత బహుజన ఫ్రంట్ డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ నిలిచారని అస్సైన్ భూమి సమితి (ఏబీఎస్)వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట గ్రామానికి చెందిన చుంచు రాజేందర్ డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితుడైన సందర్భంగా హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కలకోటి మహేందర్ మాట్లాడుతూ అసమానతలపై ఊరు- వాడకు ఉద్యమ వంతెన కట్టి రెండు దశాబ్దాలుగా అలుపెరుగని పోరు సాగిస్తున్న గొప్ప నాయకుడు చుంచు రాజేందర్ అని కొనియాడారు. రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి రావడంతో చుంచు రాజేందర్ పై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ తన బొందిలో ప్రాణం ఉన్నంతవరకు పీడిత వర్గాల తరఫున పోరాడుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, నాయకులు మేకల సాంబయ్య, మోరే ఐలయ్య, గిన్నారపు ప్రసంగి, ఓదెల సురేష్, బొమ్మెన కుమార్, గిన్నారపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
సోమవారం 03, జూన్ 2024
www.warangalvoice.net

# 400 మంది పోలీసు సిబ్బందితో కౌంటింగ్ బందోబస్తు

## పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
## ర్యాలీలు, సభలకు అనుమతి లేదు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు ఏనుమాముల మార్కెట్ లో ఏర్పాటు చేసిన వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉన్నందున లెక్కింపు కేంద్రంలో వివిధ పోలీస్ విభాగాలకు చెందిన 400 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ బందోబస్తులో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందితో వరంగల్ పోలీస్ కమిషనర్ ఏనుమాముల మార్కెట్ ప్రత్యేక సమావేశన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రానికి కేవలం ఎంపీ ఎన్నికల్లో పోటీదారులు, సంబంధిత ఏజెంట్లు, పాసులు ఉన్నవారికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఎటువంటి ర్యాలీలు, సభలకు అనుమతి లేదని ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. కౌంటింగ్ కేంద్రాలలో, బయట ప్రాంతంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలోనికి అనుమతులు ఉన్న వ్యక్తులను మాత్రమే అనుమతిస్తారని, సాధారణ ప్రజలకు అనుమతి లేదని సీపీ తెలియజేశారు. అధికారులు తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతం ముగించాల్సిన బాధ్యత ప్రతి పోలీస్ అధికారిపై ఉందన్నారు. ముఖ్యంగా రేపు వరంగల్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎవరైనా ఉత్తర్వులను అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ తెలిపారు. అంతకు ముందు ఓట్ల లెక్కింపు వేళ పోలీస్ అధికారులు నిర్వహించాల్సిన విధులను సంబంధిత అధికారులు విధులు నిర్వహించే పోలీస్ అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారీ, అదనపు డీసీపీ రవితో పాటు ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏసీపీ మూల జితేందర్ రెడ్డికి సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మూల జితేందర్ రెడ్డిని బోకే ఇచ్చి శాలువాతో సన్మానించినట్లు టీపీసీసీ గీతా సెల్ సెక్రటరీ రావుల వెంకట రమేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవప్రదమైన పోలీసు వృత్తిలో కొనసాగుతూ క్రీడల పట్ల మక్కువతో తన నేర్పు నైపుణ్యంతో అనేక అవార్డులు సొంతం చేసుకున్న జితేందర్ రెడ్డిని పోలీస్ క్రీడాకారులు, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్ వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జితేందర్ రెడ్డికి రావడం, వారిని తన చేతుల మీదుగా సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వారికి తెలంగాణ ప్రజల పక్షాన, వరంగల్ జిల్లా ప్రజల పక్షాన ప్రత్యేకంగా హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు వెంకట రమేష్ గౌడ్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రత పనులను గ్రామ పంచాయతీలకు అప్పగించే విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ స్కావేంజర్ల సంఘం మహబుబాబాద్ జిల్లా అధ్యక్షుడు ఈసంపెల్లి సైదులు అన్నారు. గత 2015 సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రత, పాఠశాల పరిశుభ్రత, చెట్ల పెంపకం, పాఠశాలల ఆవరణమంతా పరిశుభ్రత, క్లాస్ రూమ్ లో శుభ్రత, ముత్రశాలల పరిశుభ్రత, అనేక రకాల పనులు చేయుటకు 2015 నుంచి 2020 వరకు అతి తక్కువ వేతనంతో స్కావెంజర్లు ఐదు సంవత్సరాలు కాలం పాఠశాలలో పనిచేయడం జరిగింది. కరోనా కష్టకాలంలో లాక్ డౌన్ పేరుతో గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో పని చేసే స్కావెంజర్లను తొలగించి గ్రామపంచాయతీలకు అప్పగించడం వలన వారు పాఠశాలలో పరిశుభ్రత చేయుటకు వారి పనులు వారికే అతిగా ఉండటం వలన వారు చేయలేకపోయారు. గత ఐదు సంవత్సరాల కాలం పాటు పాఠశాలలను నమ్ముకొని అది తక్కువ వేతనంతో పనిచేసిన స్కావెంజర్లను ఐదు సంవత్సరాల కాలం పాటు వాడుకుని గత ప్రభుత్వం తొలగించడం సరికాదన్నారు. పాఠశాలలు పున ప్రారంభం జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా తిరిగి వారిని తీసుకోవాలని వారికి తగిన కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల్లో ఇప్పుడున్న ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమిస్తామని హామీ ఇచ్చారని, దానికి అనుగుణంగా తక్షణమే ఆ హామీని అమలు చేసి పాఠశాలల ప్రారంభం ముందే వారి నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

## వృద్ధులకు ఉచిత ఆరోగ్య శిబిరం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా దామెర మండలంలోని లాదెల్ల గ్రామంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం 60 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవల ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డిల ఆదేశానుసారం ఏర్పాటు చేసి బీపీ. షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహాకారంతో 60 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిచడం జరుగుతుందని, ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరుగుతుందని, ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామాలలోని వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జె.కిషన్ రావు, డా.టి.మదన్ మోహన్ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, గంగాధర్, అనిల్, కె.రమేష్, పోశాలు, శ్రీకాంత్, సుమంత్, గ్రామస్తులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలిసెట్‌లో శ్రీవర్షిత ప్రతిభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పాలిసెట్ ఫలితాల్లో హనుమకొండకు చెందిన బండారి శ్రీ వర్షిత ప్రతిభ చూపి మెరుగైన ర్యాంకును సాధించింది. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పాలిసెట్ ఫలితాల్లో శ్రీ వర్షిత రాష్ట్రస్థాయిలో 61వ ర్యాంకును సాధించింది. హనుమకొండకు చెందిన బండారి రాంబాబు-స్వప్నల కూతురైన శ్రీవర్షిత నగరంలోని ప్రశాంత్ నగర్ తేజస్వి పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసింది. 10 ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన శ్రీ వర్షిత పాలీసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకును సాధించడం పట్ల పలువురు వర్షం వ్యక్తం చేశారు. కాగా, 61వ ర్యాంకు సాధించిన శ్రీ వర్షితను తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు కాలనీవాసులు అభినందించారు. కాగా, రాష్ట్రస్థాయిలో 61వ ర్యాంకు సాధించిన శ్రీ వర్షిత మాట్లాడుతూ ఐఐటీలో బీటెక్ పూర్తి చేయడంతో పాటు జీవితంలో ఐఏఎస్ సాధించి తనవంతుగా సమాజ సేవ చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

## రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలి

### బీజేపీ జిల్లా నేత కుందూరు మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్షాకాలం ప్రారంభమై రైతులు విత్తనాల కోసం ఫెర్టిలైజర్ షాప్ ల చుట్టూ, సహకార సంఘాల చుట్టూ తతమ చెప్పులు అరిగేలా తిరుగుతున్న విత్తనాలు దొరికే పరిస్థితి లేకుండా పోయిందని బీజేపీ జిల్లా నాయకుడే కుందూరు మహేందర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఆరు నెలలు ముగిసినా ప్రజల ఇబ్బందులను, రైతుల ఇబ్బందులను పట్టించుకునే పరిస్థితుల్లో లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. తొలకరి జల్లులు కురుస్తున్న వేళ రైతులు ఏ షాపుకు వెళ్లిన పచ్చిరొట్ట విత్తనాలు, పత్తి విత్తనాలు లభించడం లేదన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలను అందించకుండా నాసిరకం విత్తనాలను మాత్రమే అందిస్తూ.. ఇవి మాత్రమే ఉన్నాయని తీసుకుంటే తీసుకోండి లేదంటే లేదు అని వ్యాపారులు చెబుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు లభించాల్సిన అన్ని రకాల సబ్సిడీలను అందించాలని కోరారు.

## గొడవలు వద్దు-రాజీలు ముద్దు

### పరకాల సీఐ రవిరాజ్




**వరంగల్ వాయిస్, పరకాల :** ఏవైనా వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవిత కాలం కొనసాగుతాయని, ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే సమసిపోతాయని.. అది మీరే తేల్చు కోండని, వివాదాలు కావాలా.. రాజీలు కావాలా అని సీఐ.రవిరాజ్ అన్నారు. ఈనెల 03 నుంచి 08 వరకు పరకాల కోర్టులో "నేషనల్ లోక్ అదాలత్" ఉంది కాబట్టి, మీ పై కానీ, మీకు తెలిసిన వాళ్ల పై గాని ఏమైనా కేసులు ఉంటే వాటిని కాంప్రమైజ్ చేసుకొని కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసులు పూర్తిగా క్లోజ్ చేయబడుతాయని తెలిపారు. యాక్సిడెంట్ కేసులు, కొట్టుకున్న కేసులు, చీటింగ్ కేసులకు సంబంధించిన కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగతనం కేసులు, కరోనా అప్పుడు వేసిన నోమాస్క్ కేసులు, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసులు, ఇతర రాజీపడదగు కేసులు మొదలైనవి ఈ నేషనల్ లోకదాలత్ లో కాంప్రమైజ్ చేసుకుని క్లోజ్ చేసుకోవచ్చన్నారు. కాబట్టి, ఈ అవకాశాన్ని కేసు ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికోసం ఫిర్యాదుదారుడు, నేరస్తులు అందరూ తమ ఆధార్ కార్డు తీసుకుని పరకాల కోర్ట్ /పరకాల పోలీస్ స్టేషన్‌కు రావాలని పరకాల పోలీసులు కోరారు.

## దేవులపల్లి రమేశ్‌కు మహతీ సాహితీ కవి సంగమం ప్రశంసలు



**వరంగల్ వాయిస్, సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండల కేంద్రానికి చెందిన ఎంజేపీ గురుకుల పాఠశాల తెలుగు అతిథి ఉపాధ్యాయుడు రచయిత దేవులపల్లి రమేశ్, మహతీ సాహితీ కవి సంగమం, (ఐఎస్ ఓ) గుర్తింపు పొందిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కవి సంగమంలో తెలంగాణ సాంస్కృతిక వైభవం అంశంపై ఉత్తమ రచన చేసినందుకు గానూ అభివనందలు వెల్లువెత్తాయి. దేవులపల్లి రమేశ్ కు మహతీ సాహితీ కవి సంగమం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అడిగోప్పుల సదయ్య, ప్రధాన కార్యదర్శి పొర్ల వేణుగోపాలరావు అభినందిస్తూ అంతర్జాలం ద్వారా పంపిన ధ్రువపత్రాన్ని రచయిత దేవులపల్లి రమేశ్ అందుకున్నారు.

## పిడుగుపాటుకు పాడి గేదె మృతి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రానికి చెందిన రైతు నరిశెట్టి రాజుకు చెందిన పాడి గేదె ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటుకు గురై మృతి చెందింది. తక్షణమే సంఘటన స్థలాన్ని స్థానికి పశు వైద్యాధికారి నరేష్ పరిశీలించారు. మృతి చెందిన గేదె విలువ సుమారు 70,000 ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

# అపూర్వ సమ్మేళనం




## 18 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు
## చిన్ననాటి సంగతులు పంచుకున్న వైనం
## ఆసాంతం ఆత్మీయంగా సాగిన వేడుక

**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం చదువులమ్మ చెట్టు నీడలో అంటూ ఆ నాటి స్నేహితులు తాము విద్యనభ్యసించిన పాఠశాలలో తమ చిన్ననాటి సంగతులు నెమరువేసుకున్నారు. 18 సంవత్సరాల క్రితం ఇక్కడ చదువుకొని వివిధ వృత్తుల్లో స్థిరపడి మళ్లీ చదువుకున్న పాఠశాల వేదికగా ఆత్మీయ పలకరింపులు, సంగతులతో తమ ఆనందానికీ అవధులు లేవంటూ సంతోషంగా గడిపారు. ఆదివారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట హై స్కూల్ కి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006-2007 విద్యా ఈ సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినారు. కార్యక్రమంలో సింగం తిమ్మంపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు స్వామి, గురువులు అశోక్, రవీందర్, సారంగపాణి, శ్రీ రామ్, సతీష్, భాస్కర్ లను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో 42 మంది పూర్వ విద్యార్థులు మోడెం సాగర్, కత్తి రఘు, నాగేంద్రబాబు, వినోద్, విష్ణు, ప్రసాద్, సతీష్, తిరుపతి, అశోక్, నరేష్, భిక్షపతి, మనోజ్, మహేందర్, అజయ్, ప్రశాంత్, నవీన్, రాజయ్య, ప్రియాంక, అనూష, శ్రీలత, మానస, అరుణ, రాధిక, సుమలత, కీర్తన, శ్రీదేవి, కౌసల్య, స్వప్నంజలి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలేక్టరేట్ సమావేశ మందిరం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలు రెవిన్యూ శాఖకుసంబంధించినవి (02), ఉద్యోగాలకు సంబంధించినవి (03), పెండింగ్ బిల్లులకు సంబంధించినవి (04), ఇతర శాఖలకు సంబంధించినవి (4), మొత్తం (13) దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డిలతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్ట్ ల మరమత్తుల నివేదికలు వాటి ప్రస్తుత నీటి నిలువ సామర్థ్యం , పూర్తి నీటి నిల్వ సామర్థ్యం తదితర వివరాలు వెంటనే నివేదిక రూపంలో సమర్పించాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలకు పంపిణీ చేసే బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు వచ్చే మూడు నెలలకు సరిపోయే విధంగా డీలర్లు స్టాక్ నిల్వలు సిద్ధంగా ఉంచుకోనే విధంగా చూడాలని సంబంధిత అధికారులును ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పై వైద్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు అందుబాటులో ఉండాలని, మందుల కొరత లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీఎం సివిల్ సప్లయి రాంపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఈఓ పాణిని, డీసీఓ సర్దార్ సింగ్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకం




**వరంగల్ వాయిస్, శాయంపేట :** 2023- 2024 విద్యా సంవత్సరానికి గాను పదిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ఆదర్శ రైతు కొండా ఆనందం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు విద్యార్థులకు ప్రోత్సాకాల్ని అందించారు. శాయంపేట మండలం పెద్దకోడెపాక జడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తడుక అక్షయ, జక్కుల అభినయ్, చింతల అర్చన ఈ సంవత్సరం ఎస్సెస్సీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను, ఒక్కొక్కరికి రూ.3500 నగదు పారితోషికాన్ని ఆనందం కుమారుడు కొండా వెంకటేశ్వర్లు, పావని విద్యార్థులకు అందించడం జరిగింది. అనంతరం వెంకటేశ్వర్లు పావని మాట్లాడుతూ మా నాన్న విద్యను ప్రేమించేవారని, చదువు మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుందనేది మా నాన్న అభిప్రాయ పడేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ ఆనందం సతీమణి యశోద ఆనందం, కూతుర్లు అల్లుళ్లు కవిత- కుమారస్వామి, వాణి- విజయ్ కుమార్, శ్వేత- శ్రీధర్, మోహిని-రమేష్, చంద కొమురయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాసర్ల చంద్రమౌళి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అన్న వసంత -అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కుడా చైర్మన్ ఇనగాల ఇంటికి కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, చెన్నూర్ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యుడు డా.గడ్డం వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ ను సోమవారం హనుమకొండలోని పీసీసీ సభ్యుడు, పరకాల నియోజకవర్గ ఇంచార్జి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసానికి మర్యాద పూర్వకంగా సాదరంగా ఆహ్వానించారు.

## లారీ, ఆటో ఢీ ఒకరికి గాయాలు
### చెరువులోకి దూసుకెళ్లిన లారీ



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా లారీ ఆటో ఢీ కొన్న సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు కాళేశ్వరం నుంచి ఇసుక లోడుతో అతి వేగంతో వస్తున్న లారీకి రేగొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా పరకాల భూపాలపల్లి చిట్యాల క్రాస్ నుంచి నిజాంపల్లి క్రాస్ అవుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఆటో అతి వేగంతో వెళుతున్న లారీకి ఎదురవ్వడంతో ఆటోని తప్పించే క్రమంలో ఆటోని ఢీ కొని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న దామర చెరువులోకి దూసుకెళ్లింది. దీంతో లారీ ఆటో పూర్తిగా ధ్వంసం కాగా ఆటో డ్రైవర్ బొమ్మకంటి రవికి తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా పరకాల హాస్పటల్ తరలించినట్టు తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదానికి గల కారణాలను గుర్తించి విచారిస్తున్నట్లు ఎస్ ఐ రవి కుమార్ తెలిపారు.



## ఎలాంటి ఖర్చు లేని చక్కని వ్యాయామం సైక్లింగ్
### ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎలాంటి ఖర్చు లేని చక్కని వ్యాయామం సైక్లింగ్ అని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. "వరల్డ్ సైకిల్ డే"సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేయని పైసా ఇంధన ఖర్చులేని సైక్లింగ్ ను ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక మంచి వ్యాయామంగా చేసుకున్నట్లయితే ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షించిన వారు అవుతారని అన్నారు. మెట్రోపాలిటన్ నగరాలలో ఈ సంస్కృతి ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుందని, మన వరంగల్ లో కూడా అనేక సైకిల్ క్లబ్లు ఉన్నాయని, వీటి సంఖ్య మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఫారెస్ట్ ఆఫీసు నుంచి ఫాతిమా నగర్ వరకు ప్రత్యేకంగా ఎంతో శ్రద్ధతో నిర్మించిన సైకిల్ ట్రాక్ ఆక్రమణలకు గురై సైక్లిస్టులకు తీవ్ర నిరాశ మిగిల్చిందని, ఇప్పటికైనా అధికారులు ఈ ట్రాక్ పునరుద్ధరణ చేసి సైకిల్ ప్రేమికులకు మేలు చేయాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సోమవారం 03, జూన్ 2024
www.warangalvoice.net

# జనం కోసం జనరల్ బోగీలు.. కోటి ఉత్తరాల విన్నపం

## ప్రతి రైలులో సాధారణ భోగీలను ఐదుకు పెంచాలి

### డాక్టర్ పరికిపండ్ల అశోక్




**వరంగల్ వాయిస్, కారేపల్లి :** ప్రతి రైలులో సాధారణ భోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని ఐదు సాధారణ భోగీల సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సాధన సమితి జాతీయ కన్వీనర్, జాతీయ అవార్డు గ్రహీత-డాక్టర్ పరికిపండ్ల అశోక్ దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా కారేపల్లి మండలం టేకులగూడెంలో యువజన నాయకుడు పెద్ద బోయిన ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సీనియర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య స్వయంగా ఉత్తరం రాసి ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఐదు సాధారణ భోగీల సాధన కోసం ప్రధానమంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాల గాంధీ మార్గంలో ఉద్యమాన్ని వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు అనధికార అంచనా ఉండగా, ఈ ప్రయాణంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఆగమ్య గోచరంగా ఉంటుందని, సీట్లు తక్కువగా ఉండటం, బోగీల్లో స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలై చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అశోక్ పరికిపండ్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రవాణా వ్యవస్థగా ఉన్నటువంటి భారతీయ రైల్వేలు సాధారణ పౌరునికి అందిస్తున్న సేవలు మాత్రం శూన్యంగా ఉన్నాయని, ప్రతి పేదవాడు విద్య, వైద్యం, ఆరోగ్యం, బంధువుల సందర్శన, అత్యవసర పనుల రీత్యా ఆశ్రయించేది సరసమైన ధరలో లభించేటువంటి రైలునేనని, కానీ సౌకర్యాల పరంగా రైల్వేలు అందిస్తున్న సేవలు అగమ్య గోచరంగా ఉన్నాయని డాక్టర్ అశోక్ తెలిపారు. నెల రోజుల క్రితం తెలంగాణలోని మహబూబాబాద్ లో కోణార్క్ ఎక్స్ ప్రెస్ ఎక్కుతూ ఒక దళిత స్త్రీ కిందపడి చంకలో ఉన్న పాపతో పాటు కడుపులో ఉన్న పిండాన్ని కూడా కోల్పోవడంతో కలత చెంది ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు తెలంగాణలోని 30 జిల్లాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తూ, ఇటీవలనే గుజరాత్ రాష్ట్రానికి వెళ్లి, అక్కడ కూడా పలు జిల్లాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ఆంధ్రప్రదేశ్ లోని 14 జిల్లాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తూ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని కొనసాగిస్తున్నట్లు డాక్టర్ అశోక్ తెలిపారు. ఈ అంశాన్ని భారతదేశంలోని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా-టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ-110011 చిరునామాకు మన బాధను, డిమాండ్ ను అభిప్రాయాల్ని తెలుపుతూ ఉత్తరం రాసి పంపాలని, అంతేకాకుండా ప్రతి ఒక్కరూ వారి మిత్రులు, బంధువుల ద్వారా ఒక్కొక్కరు 100 మందితో రాయించాలని పోస్ట్ చేయాలని, ఈ విషయాన్ని వందమందికి వాట్సప్ గ్రూపులలో షేర్ చేయాలని, అంతేకాకుండా @%PMOIndiaకు ట్విట్టర్ ఖాతాలో Xద్వారా ట్వీట్ చేయాలని కోరారు. వివరాలకు 9989310141లలో సంప్రదించాలని తెలిపారు. కారేపల్లి మండలంలో జరిగిన ఉత్తరాల కార్యక్రమానికి జబర్దస్త్ ఫేమ్ రాజమౌళి, డప్పు శ్రీను, వివిధ ఉద్యోగ అవసరార్థం రోజువారి రైలు ప్రయాణికులు మద్దతు తెలిపి ప్రధానమంత్రికి స్వయంగా ఉత్తరాలు రాశారు.

# తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని, ఉద్యమకారుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నదని, ఈ క్రమంలో తెలంగాణ కోసం పోరాడిన పార్టీలను, సంఘాలను, ఉద్యమకారులను గుర్తించాలన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమ కారులకు న్యాయం చేయాలని, ఉద్యమ కాలంలో తెలంగాణ కోసం అమరులైన ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. గడిచిన పదేళ్లలో అప్పటి ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదని, అందుకే తెలంగాణ ప్రజలు ఆ ప్రభుత్వాన్ని గద్దె దింపారని అన్నారు. ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలతో పాటు అనేక కేసులను ఎదుర్కొని జైలు పాలయిన వారికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా నాయకులు ఆదరి శ్రీనివాస్, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం



**వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల :** గ్రేటర్ వరంగల్ 15 డివిజన్ మొగిలిచర్లలో బీజేపీ అధ్యక్షుడు బిల్లా రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాటి తెలంగాణ ఉద్యమకారుడు జేఏసీ నేత ఆడెపు రమేష్‌తో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు ఆడెపు రమేష్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న పది సంవత్సరాలు పరిపాలన చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు లక్షల కోట్లు సంపాదించి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిండు అన్నారు. 1200 మంది విద్యార్థి అమరవీరుల శవాలపై ఆసనం వేసుకొని కూర్చుని ఉద్యమకారులకు న్యాయం చేయలేదన్నారు. నిజమైన ఉద్యమకారులను ఘోరంగా అవమానించింది బీఆర్ఎస్ ప్రభుత్వమని, ఉద్యమకారులకు ఏనాడూ ప్రశంసాపత్రం ఇవ్వలేదని, గౌరవ వేతనం ప్రకటించలేదని, నిజమైన ఉద్యమకారులతో జెండా ఎత్తించలేదని మండిపడ్డారు. ఏ ఉద్యమకారులైతే కేసీఆర్ ను గద్దెనెక్కించారో, అదేవిధంగా కేసీఆర్ కుటుంబాన్ని పాతాళానికి తొక్కేశారన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకొని 250 గజాల స్థలాన్ని ఇచ్చి పక్కా ఇల్లు కట్టిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు గౌరవ వేతనంగా నెలకు రూ. 25000 గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో జైలు పాలైన వారికి, ఆర్థికంగా నష్టపోయిన ఉద్యమకారులకు ఐదు లక్షల రూపాయలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూతం రమణయ్య, సొసైటీ డైరెక్టర్ లెంకలపల్లి స్వామి, అడ్వకేట్ మల్లికార్జున్, నరిశెట్టి చంద్రమౌళి, కందికొండ మనోహర్, యువ నాయకులు అప్పని సాగర్, బొట్టు వికాస్, సింగతి వంశీ, రాచమల్ల వీరస్వామి, చింతం కట్ట స్వామి, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉద్యమకారులకు ప్రభుత్వం గుర్తింపు గుర్తించాలి

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నేటి ప్రభుత్వం అమలు పరచాలని వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఈ నెల 3న తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలలో భాగంగా కరీమాబాద్ లోని ఎస్ కే గౌడ్ స్మారక కళాభవన్ లో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్ అధ్యక్షతన జరిగిన ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ మరుపల్ల రవి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొంతమంది ఉద్యమకారులు జైలు పాలైనారని, కొందరు రిమాండ్లు, బైండోవర్లు అయ్యారని, అటువంటి వారిని ప్రభుత్వం గుర్తించి ఉద్యమకారులుగా ప్రశంసా పత్రం ఇవ్వాలన్నారు. నేటి రోజులలో అసలైన ఉద్యమకారులు మరుగున పడిపోతున్నారని, అసలుకే ఉద్యమంలో పాల్గొనని వారు కొంతమంది ఉద్యమకారులుగా చెలామణి అవుతున్నందున పోలీస్ శాఖ ద్వారా విచారణ జరిపించి ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలన్నారు. జైలు జీవితం గడిపిన వారికి 250 గజాలు స్థలం, రూ. 25 వేల పెన్షన్ ఇస్తామని, ఆరు గ్యారెంటీలో ప్రభుత్వం పేర్కొన్నందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు. సన్మానం పొందిన వారిలో అంకం దేవానంద్, కేంచ ఆనంద్, పూజారి విజయ్, వనం కుమార్, కోరే సుభాష్, ఎండీ వహీదా, పసునూరి రమేష్, నాగపురి కిషోర్, గడ్డం రమేష్, క్యాతం రాజేందర్, బోనాల సంపత్, కళ్యాణపు వెంకటేశర్లు, గోగికర్ కిషోర్, నాయకులు శెట్టి మోహన్, మరుపల్ల గౌతమ్, చీర రమేష్, పొట్టబత్తుల స్రవంతి, తుమ్మ సుమలతలు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ' ఫ్యామిలీ గెట్ టు గెదర్"



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో ఫ్యామిలీ గెట్ టు గెదర్ హంటర్ రోడ్డులోని గోల్డెన్ గార్డెన్ లో నిర్వహించారు. ఈ గెట్ టు గెదర్ కార్యక్రమంలో 50 రోటరీ జంటలు పిల్లలతో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ హనుమకొండ ప్రెసిడెంట్ అన్నం రవీంద్రనాథ్, సెక్రెటరీ శిరీష్ కుమార్, ట్రెజరర్ నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రోటరీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి రోటరీ సభ్యుడు హరిబాబు, ఏంహెచ్ బీ కన్ స్టక్షన్స్, హర్షవర్ధన్ సూర్య కుటీర్ స్పాన్సర్ చేశారని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీజీ గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ ఫంక్షన్ అంటే ఇలా ఉండాలని, ముందు ముందు రోటరీ సభ్యులంతా సమాజానికి సేవ చేసే విషయంలో ఆదర్శంగా ఉండాలన్నారు. పీడీజీ డాక్టర్ శరత్ బాబు మాట్లాడుతూ రోటరీ సభ్యులంతా అందరం కలిసికట్టుగా ఉండి రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండను ముందుకు తీసుకెళ్లాల్సిందిగా సభ్యులందరినీ కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు సూర్య, దారం శ్రీనివాస్, సురేష్, చారు ప్రభాకర్ రెడ్డి, సతీష్ విజయ్ కుమార్, మంజుల, లక్ష్మి, మిగతా లేడీ రొటీరియన్స్, కొత్తగా జాయిన్ అయిన రోటరీ సభ్యులు, హనుమకొండ రోటరీ సభ్యులందరూ పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తగిలి ఎద్దు మృతి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి శివారు దేవీలాల్ తండాకు చెందిన ధరావత్ వెంకన్నకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందింది. సోమవారం ఎద్దు మేత వేస్తుండగా పొలాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వైరు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు 50,000 ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విలపిస్తూ తెలిపాడు.

# అఖండ-2 విలన్‌గా సంజయ్‌దత్ ?

'అఖండ 2' స్క్రిప్ట్ పనుల్లో బోయపాటి బిజీబిజీగా ఉన్నారు. ఈ సినిమా కథ పూర్తి శైవత్వం నేపథ్యంలో సాగుతుందని విశ్వసనీయ వర్గాల భోగట్ట. ఇందులో విలన్ పాత్ర అత్యంత శక్తిమంతంగా రాసుకున్నారట బోయపాటి. ఆ పాత్రకోసం బాబీడియోల్, సంజయ్‌దత్‌లను కూడా కలిశారట. అయితే.. సంజయ్‌దత్ దాదాపు ఖరారైనట్టు సమాచారం. దక్షిణభారత దేశంలో శైవం ఎంత బలీయంగా ఉంటుందో, ఇక్కడి ఆలయాల ప్రాచుర్యం, వాటి ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో ఈ కథలో వివరించనున్నారట బోయపాటి. బాలయ్య, సంజయ్‌దత్‌ల పాత్రల్ని నువ్వానేనా అనేలా డిజైన్ చేస్తున్నారట. ప్రస్తుతం కె.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో బాలయ్య నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అయ్యాక. బోయపాటి సినిమా ఉంటుందని తెలుస్తున్నది.





# కల్కితో పోటీ

## అదే తరహాలో పాత్రలు, సన్నివేశాలు



తెలుగు ప్రజలు ఇప్పుడు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా ఏదైనా ఉందంటే అది ప్రభాస్ నటించిన కల్కి మాత్రమే. అయితే కల్కి సినిమాకు పోటీగా అచ్చం అలాంటి కథాకథనాలతో, క్యారెక్టర్స్‌తో ఓ చిత్రం సిద్ధమైంది. అది కూడా తెలుగులోనే వస్తుండడం గమనార్హం.అయితే ఇది మన దేశంలోనే ఫస్ట్ టైం సూపర్ ఉమెన్ నేపథ్యంలో రూపొందిన చిత్రం అవడం విశేషం. ఆ సినిమా పేరు 'ఇంద్రాణి . యానీయా ప్రధాన పాత్రలో నటిస్తోండగా జిల్, సుప్రీమ్ సినిమాల్లో విలన్‌గా నటించిన కబీర్ సింగ్ ఈ చిత్రంలో సూపర్ విలన్‌గా నటిస్తోన్నారు. స్టీఫెన్ పల్లం దర్శకత్వం వహించారు. తాజాగా విడుదల చేసిన ఈ చిత్రం ట్రైలర్‌ను చూస్తే కల్కి సినిమాతో చాలా సారూప్యతలు ఉన్నట్లు తెలుస్తోంది. . కల్కిలో బుజ్జి అనే రోబో ఉన్నట్లే ఈ సినిమాలో చిట్టి అనే అదే టైపు, అదే తరహా రోబో కూడా ఉండడంతో పాటు 2021 ఏడీ అంటూ సినిమా జరిగే సమయాన్ని కూడా చూయించారు. ఇలా సినిమా అసాంతం చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. పైగా ఈ సినిమాను ఫ్యూచరిస్టిక్ వరల్డ్ నేపథ్యంలో ఆద్యంతం విజువల్ ఎఫెక్ట్స్ తో తెరకెక్కించారు. ఈ సినిమా ట్రైలర్ విడుదల సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ భవిష్యత్‌లో భారతదేశం టెక్నాలజీ ఏ విధంగా ఉండబోతుందో ఈ సినిమాలో చూపించబోతున్నామని, ఓ రోబో కూడా ఉంటుందని, వీఎఫ్ఎక్స్ వర్క్ మంచిగా వచ్చిందని అందరినీ అకట్టుకుంటుందన్నారు.





# హీరామండి.. సీజన్ -2



సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన 'హీరామండి: ది డైమండ్ బజార్' ఇటీవల విడుదలై సంచలనం సృష్టించింది. భారీ తారాగణంతో పీరియాడిక్ డ్రామాగా రూపొందిన ఈ వెబ్ సిరీస్ బాలీవుడ్ ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. తన సినిమాల్లాగే దీన్ని కూడా సంజయ్ చాలా గ్రాండ్‌గా తెరకెక్కించారు. ఇప్పుడీ సిరీస్‌కు సీజన్ 2ను ప్రకటించి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చారు. మొదటి పార్ట్‌కు కొనసాగింపుగా ఏం చూపనున్నారో వివరించారు. సీజన్2 గురించి సంజయ్‌లీలా భన్సాలీ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఈ సిరీస్ కోసం నేను 2022లో 'గంగూబాయి కాఠియావాడి' పూర్తయినప్పటి నుంచి కష్టపడ్డాను. నా తొలి సిరీస్ కావడంతో మరింత కష్టంగా అనిపించింది. 'హీరామండి-2'లో వేశ్యలందరూ లాహోర్ వదిలి సినీ పరిశ్రమకు వస్తారు. దేశ విభజన సమయంలో వారందరూ ముంబయి, కోల్‌కతా వెళ్లి స్థిరపడతారు. అక్కడినుంచి ఇండస్ట్రీలోకి ఎలా వచ్చారన్నది చూపనున్నా. సీజన్2లోనూ వాళ్లందరూ డ్యాన్స్ చేస్తారు. అయితే మొదటి పార్ట్‌లో నవాబుల కోసం డ్యాన్స్ చేసినవారు.. రెండో సీజన్‌లో చిత్ర నిర్మాతల కోసం చేస్తారు. ఈ కథతో ముందుకువెళ్లనున్నా. ఎప్పుడవుతుందో చూడాలి' అని తెలిపారు. ఇక సీజన్ 2 ప్రకటించడంలోనూ సంజయ్ తన మార్క్ చూపారు. 100 మంది అమ్మాయిలు అనార్కలీ డ్రెస్‌లో డ్యాన్స్ వేస్తూ.. సీజన్2 ఉన్నట్లు ఆ మూమెంట్స్‌తో తెలిపారు. ఈ వీడియోను నెట్‌ఫ్లిక్స్ షేర్ చేయగా అది అందరినీ ఆకట్టుకుంటోంది. తొలిభాగంలో మనీషా కొయిరాలా, సోనాక్షి సిన్హా, అదితిరావు హైదరీ, రిచా చద్దా, సంజీదా షేక్, షర్మిన్ సెగల్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. రూ.200కోట్లతో రూపొందిన ఫస్ట్‌పార్ట్‌లోని కొన్ని సన్నివేశాలు ఇన్‌స్టాలో ట్రెండ్ సృష్టించాయి.



# ప్రమోషన్స్ పెంచిన కల్కి టీమ్

## క్లీంకారకు బుజ్జి బొమ్మ గిఫ్ట్



కల్కి' టీమ్ ప్రమోషన్స్ జోరు పెంచింది. అందులో భాగంగానే సినీ సెలబ్రిటీల పిల్లలకు గిఫ్ట్‌లు పంపుతోంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898 ఏడీ' ఈ చిత్రం జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల బుజ్జి వెహికల్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించిన టీమ్.. దీంతోనే ప్రమోషన్స్‌ను షురూ చేసింది. సినీ సెలబ్రిటీల పిల్లలకు 'కల్కి' టీమ్ గిఫ్ట్‌లు అందుతున్నాయి. తాజాగా రామ్ చరణ్ కుమార్తె క్లీంకారకు మూవీ యూనిట్ ఓ బహుమతి అందించింది. అందులో బుజ్జి - భైరవ స్టికర్స్, బుజ్జి బొమ్మ, టీషర్ట్స్ ఉన్నాయి. క్లీంకార వాటితో ఆడుకుంటున్న ఫొటోలను ఉపాసన ఇన్‌స్టాలో షేర్ చేశారు. కల్కి టీమ్‌కు థ్యాంక్స్, 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. అలాగే మరికొంతమంది సెలబ్రిటీల పిల్లలకు కూడా వీటిని పంపనున్నట్లు తెలుస్తోంది. ప్రచారంలో భాగంగానే తాజాగా 'బుజ్జి అండ్ భైరవ' పేరుతో యానిమేటెడ్ సిరీస్ తీసుకొచ్చింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్‌కు మంచి ప్రేక్షకాదరణ వచ్చింది. ప్రభాస్ సరసన దీపిక పదుకొణె నటిస్తుండగా.. సీనియర్ హీరో కమల్ హాసన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే అమితాబ్ బచ్చన్, పశుపతి, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# అమరుల కుటుంబాలను ఆదుకుంటాం..

**రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలు వెలకట్టలేనివి**

**రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్**

**తెలంగాణ ఉద్యమ కారులకు ఘన సన్మానం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలు వెలకట్టలేనివని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యములో హనుమకొండలోని హంటర్ రోడ్డు డి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో అమరుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నాలుగు కోట్ల ప్రజల చిరకాల స్వప్నం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు కృషి చేసిన సోనియా గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. గడిచిన పది ఏండ్లలో ఉద్యమకారులను, వారి కుటుంబాలను కనీసం గుర్తించని వారు నేడు మాపై అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో అమరుల కుటుంబాలను గుర్తించి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని గుర్తు చేశారు. తప్పకుండా ఇది అమలు చేసి తీరుతామని మంత్రులు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేశామన్నారు. ఇంకా అనేక సంక్షేమ పథకాలు చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది కాకతీయ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రొపెసర్ కోదండ రామ్ తో పాటు అమరుడైన శ్రీకాంత చారి తల్లీ శంకరమ్మను, ఇతర అమరుల కుటుంబాలను ఘనగా సన్మానించారు.

## సంక్షేమమే మా లక్ష్యం..

పేద ప్రజల సంక్షేమమే మా లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని తెలంగాణ ఉద్యమ కారులను సన్మానించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రత్యేక ఉద్యమంలో ఎంతో మంది ప్రాణాలనుసైతం లెక్క చేయకుండా ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఎవరో ఒక్కరు ఉద్యమం చేస్తే తెలంగాణ రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, ఉపాధ్యక్షురాలు బంద్రు శోభారాణి, మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, సీతారాం నాయక్, పసునూరి దయాకర్, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకటస్వామి, గండ్ర సత్యనారాయణ రావు, యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ రియాజ్, కాజీపేట దర్గా పిఠాధిపతి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ , ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు మేధావంతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## 'కూరపాటి' తేనీటి విందుకు రాష్ట్ర మంత్రులు

ఆచార్య కూరపాటి వెంకట్ నారాయణ ఆహ్వానం మేరకు హనుమకొండలోని ఆయన నివాసానికి రాష్ట్ర మంత్రులు దనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మధు యాష్కి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ హాజరయ్యారు. వారి వెంట ఆచార్య వడ్డే రవీందర్, ఆచార్య గుగులోతు వీరన్న, ఆచార్య రామ్ రెడ్డి, ఆచార్య కందకట్ల సుధాకర్, డాక్టర్ సంగని మల్లేశ్వర్, డాక్టర్ తిరుపతి, డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి తేనీటి విందును ఇచ్చారు.









# సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవ మూర్తికి ఘన సన్మానం

**సన్మానించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ హంటర్ రోడ్ లోని ఢీ కన్వెన్షన్ హాల్ లో సీనియర్ జర్నలిస్ట్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తిని ఘనంగా సన్మానించారు. సన్మాన సభకు ముఖ్య అతిథిలుగా హాజరై మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, ధనసరి సీతక్క చేతుల మీదుగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. అమర వీరుల చిహ్నంతో కూడిన మెమోంటోను ప్రధానం చేశారు. 2001 నుంచి 2014 వరకు జరిగిన ఉద్యమ ఘట్టాలను కళ్లకు కట్టినట్లు 'తెలంగాణ ఆత్మఘోష'పేరిట పుస్తకాన్ని రచించిన గడ్డం కేశవ మూర్తి ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు.



'తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు'అనే నినాదంతో చేసిన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనడమే కాకుండా ఢిల్లీ నడిబొడ్డులోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన జర్నలిస్టుల దీక్షలో సైతం పాల్గొన్న ధీంబాయి టీవీ సీఈఓ వేముల సదానందం నేత, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్, సీనియర్ జర్నలిస్ట్ ఎన్ఎస్ రావ్ లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శాలువ కప్పి అమర వీరుల చిహ్నంతో కూడిన మెమోంటోలు ప్రధానం చేసి సత్కరించారు.



తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఫోటో జర్నలిస్ట్ గోకారపు శ్యాంకుమార్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మంత్రులు ధనసరి అనసూయ, పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com